క్లుప్తంగా

భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి సోపానం

లింగాల : భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి సోపానమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఎస్.తులసిరెడ్డి తెలిపారు. శనివారం వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవరకోన హరిహర క్షేత్రంలో వెన్నపూస నారాయణరెడ్డి అధ్యక్షతన భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రశాంతి నిలయాలుగా నిలుస్తాయన్నారు. రామాయణం, మహాభారతం, మహా భాగవతం, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి రూపాలుగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో భాగవత భక్త సమాజ మండలి సభ్యులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం


వంకలో పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

కమలాపురం : మండలంలోని సి.గోపులాపురం-పాచికలపాడు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో గోపులాపురం-పాచికలపాడు మధ్య ఉన్న చిన్నపాటి వంక పొంగి ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా గోపులాపురం గ్రామ ప్రజలు పొలాలకు వెళ్లాలంటే ఈ వంకను దాటి వెళ్లాల్సిందే. పశు గ్రాసం తెచ్చుకోవాలన్నా, పొలం పనులకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రహారి నిర్మాణానికి భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు : స్టీల్ ప్లాంట్ ప్రహారి నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శనివారం సున్నపురాళ్లపల్లె సమీపంలో జిందాస్ స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులు సుదర్శన్, ఇంజనీర్లతోపాటు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. మూడు సంవత్సరాలలో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అంజన్న ఆలయాలలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మార్కెట్ ఆంజనేయ స్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి శనివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, ఆకు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. పట్టణంలోని తూర్పు అంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి, పీడబ్ల్యూడీ కాలనీ, ఆర్‌ఆర్ కాలనీలతోపాటు వివిధ అంజన్న ఆలయాల్లో భక్తుల తాకిడితో కనువిందు చేశాయి. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గండికి భక్తుల పాదయాత్ర

తొండూరు : శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన భ క్తులు పాదయాత్రగా గండి క్షేత్రానికి తరలి వెళ్లారు. శనివారం తొండూరు, కోరవానిపల్లె, బూ చుపల్లె, ఇనగలూరు, మడూరు, తదితర గ్రామాలకు చెందిన భక్త లు నడుచుకుంటూ వెళ్లి మొక్కుబడులు చెల్లించారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమిస్తాం

కడప ఎడ్యుకేషన్ : దేశంలో భారత రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రభుత్వ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. కడప నగరం ప్రకాష్ నగర్ లోని ప్రభుత్వ బాలుర వసతి గృహం వద్ద క్విట్ ఇండియా మూవ్‌మెంట్ డే సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ముమ్మరంగా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారం

పులివెందుల నియోజకవర్గంలో జడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా అచ్చివెల్లి, నల్లగొండువారిపల్లెల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి తనయుడు డాక్టర్ దినేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. – పులివెందుల


సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు


నల్లగొండువారిపల్లెలో ప్రచారానికి వెళుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు


ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



కూటమి ప్రభుత్వం ఎన్ని కష్టాలు పెట్టినా మేము మీకు అండగా ఉంటాం అని నల్లగొండువారిపల్లెలో జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా స్థానికుడు శంకర్ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిల వద్ద కంటతడి పెట్టాడు. నాకు ఇల్లు మంజూరు కాలేదని, ఆరోగ్యం సరిగా లేదని, ఇల్లు మంజూరు చేయించాలని వారిని కోరాడు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందిస్తూ నీకు ఎటువంటి కష్టం రానివ్వమని శంకర్‌కు భరోసా కల్పించాడు.


పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి నల్లగొండువారిపల్లె ప్రచారంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి షేక్ ఇస్మాయిల్


వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అచ్చివెల్లిలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం


ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో భాగంగా పులివెందుల మండలం అచ్చివెల్లి, ఉప్పరాంపల్లె, పుట్రాయునిపేట గ్రామాల్లో శనివారం ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతి ఒక్కరూ అండగా ఉండి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌ను గెలిపించండి

జమ్మలమడుగు : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని గెలిపించాలంటూ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల ఉప మండలాధ్యక్షుడు మల్లు వెంకట మోహన్‌రెడ్డిలు శనివారం నల్లగొండువారిపల్లెలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భయపడకుండా ఓట్లు వేసేందుకు ముందుకు రావాలి

- ప్రముఖ వైద్యులు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో భయపడకుండా ఓట్లు వేసేందుకు ప్రజలు ముందుకు రావాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పులివెందుల మండలం అచ్చివెల్లి గ్రామంలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రజల నుంచి ప్రచారం బాగా సాగుతోందని, కానీ ప్రభుత్వం నుంచి చూస్తుంటే ఏ విధంగా అపోజిషన్ లేకుండా చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు. ఒక ఊరి నుంచి ఒక గ్రామం నుంచి 50 నుంచి 60 శాతం ఓట్లను వేరే గ్రామానికి వేసి 4 కి.మీ దూరంలో ఆ గ్రామం ఉందని, పెద్దోళ్లు కానీ, ముసలోళ్లు కానీ ఏ విధంగా ఓటు వేయడానికి అక్కడికి పోతారన్నారు. మీరు ఓడిపోతారనే ఇంత చేస్తున్నారని ప్రభుత్వాన్ని అడుగుతున్నానన్నారు. మీరు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలు చేసి ఉంటే ఇవన్నీ మీరు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్సీలకు కూడా రక్షణ కల్పించకపోతే మామూలు జనాలకు ఏవిధంగా రక్షణ కల్పిస్తారన్నారు. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలీసులు సహాయం చేయాలని అది మీ ధర్మం అన్నారు.

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదర్శన


పుష్పగిరి ప్రదక్షణలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్కన్ హెరిటేజ్ అకాడమీ వ్యవస్థాపకులు, చైర్మన్ మణికొండ వేదకుమార్, మధ్యప్రదేశ్ ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ నీరజ్ వర్ధమాన్, భువనేశ్వర్ ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ అనిల్ ధీర్ ముఖ్య అతిథులుగా హాజరై పాదరాయి వద్ద పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పుష్పగిరి కొండపై శ్రీచెన్నకేశవస్వామిని దర్శించుకుని పుష్పగిరి క్షేత్ర విశిష్టతను తెలుసుకున్నారు. ఈ పుష్పగిరి చాలా గొప్ప క్షేత్రమని క్షేత్రంలో గిరి ప్రదక్షణ గొప్ప కార్యక్రమని వారు పేర్కొన్నారు. క్షేత్ర అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

గాలి బుడగ గుర్తును అఖండ మెజార్టీతో గెలిపించండి


ఓటరును అభ్యర్థిస్తున్న ఇండిపెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి భూమిరెడ్డి రవీంద్రారెడ్డి

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో భాగంగా శనివారం ఇండిపెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి భూమిరెడ్డి రవీంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి గాలి బుడగ గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నన్ను జెడ్పీటీసీగా గెలిపిస్తే పులివెందుల అభివృద్ధితోపాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం


నల్లపురెడ్డిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఇండిపెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి అంకిరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో భాగంగా శనివారం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె పంచాయతీలో ఇండిపెండెంట్ జెడ్పీటీసీ అభ్యర్థి అంకిరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళుతూ ఓటర్లను కలుస్తూ ఈ ఎన్నికలలో బీరువా గుర్తుకు ఓట్లు వేసి వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికలలో నన్ను జెడ్పీటీసీగా గెలిపిస్తే పులివెందుల మండల అభివృద్ధితోపాటు ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట


ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మతల్లి

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని పొన్నపుతోట గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సోజీ కొట్టాల గ్రామంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హనుమాన్‌శర్మ, ఫణీంద్రస్వామిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు, డాక్టర్ రామేశ్వరుడు పాల్గొన్నారు.

వైభవంగా భేతాళ అంజనేయస్వామి ఉత్సవాలు


తిరుణాలలో బండలాగుతున్న ఎద్దులు


విశేష అలంకారంలో ఆంజనేయస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ పంచాయతీలోని రెడ్డిపల్లె సమీపంలో వెలసిన శ్రీభేతాళ అంజనేయస్వామి వార్షికోత్సవ ఉత్సవా లు శ్రావణమాస మూడవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము, నవగ్రహ పూజ, ఆకుపూజ, రుద్ర హోమం, మహామంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయ కర్పూరాలతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఆంజనేయస్వామికి ఘనంగా పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని ఆంజనేయ స్వామి దేవాలయాలలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే ఏఎల్ కాలనీ సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా భక్తులు ఘనంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు, కళాకారులచే కోలాటం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అన్నాచెల్లెళ్ల అనురాగానికి రాఖీ పౌర్ణమి


అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

పులివెందుల టౌన్ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తోందని.. సోదరి తన అన్నకు రాఖీ కట్టి సుఖ సంతోషాలతో అండగా ఉండి కలకాలం హాయిగా జీవించాలని రాఖీ కడుతుంది. శనివారం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముడు రాఖీలు కట్టారు. తమ తోబుట్టువులు సంతోషంగా ఉండాలని ఆశీర్వదించడంతోపాటు కానుకలు, బహుమతులు ఇచ్చి ఆనందంగా ఉండాలని దీవించారు. పట్టణంలోని ఏ ఇంట్లో చూసినా పిల్లల సంతోషాలను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు ఇంటి వద్ద ఉండటం కూడా రాఖీ పండుగకు కొత్త శోభ సంతరించుకుంది.

తొండూరు : రాఖీ పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీ కట్టి ఒకరికొకరు తమ ఆత్మీయతను పంచుకున్నారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టి ఆశీర్వదించుకున్నారు.

గండి శ్రావణమాస ఉత్సవాల్లో వలంటీర్ల నిర్వహణ


అంజన్న సేవలో ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

వేంపల్లె : గండి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో, భక్తుల సౌకర్యం, భద్రత కోసం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ జాతీయ సేవా పథకం యూనిట్-11, యూనిట్-15 వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. శ్రావణమాస రెండవ శనివారం పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు క్యూలైన్ల నిర్వహణ, భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించారు. వీరి సేవలను గండి ఆలయ ఈఓ, చైర్మన్, ఐఐఐటీ డైరెక్టర్, ఏఓ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గండి భారతి

కమలాపురం : వర్షా కాలం ప్రారంభం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ గండి భారతి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కెజియా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షా కాలం ప్రారంభమైంది. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటాయి. దీంతో దోమలు పెరిగి జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయి. పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది కలసి క్షేత్ర స్థాయిలో పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం, డ్రైనేజ్ పూడిక తీయడం, నిల్వ ఉన్న నీటిలో దోమలు చేరకుండా ద్రవాలు పిచికారి చేయడం తదితర చర్యలు చేపట్టాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కెజియా మాట్లాడుతూ ఐవీఆర్‌ఎస్ కింద ఎంపికైన చిన్నచెప్పలి, సంబటూరు, సి.రాజుపాళెం, నల్లలింగాయపల్లె, పందిళ్లపల్లె, లేటపల్లె, పెద్దచెప్పలి గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజు చెత్త సేకరించాలన్నారు. ఐవీఆర్‌ఎస్ ద్వారా చెత్త సేకరణపై ప్రజలతో అభిప్రాయాలు తీసుకుంటారని, చెత్త సేకరించలేదని ప్రజలు చెబితే మనమంతా ఉన్నతాధికారులతో మాటలు పడాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా సర్పంచులు, ఎంపీటీసీలు ఐవీఆర్‌ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు త్వరలో వస్తాయని, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు అప్పుడే చెల్లిస్తామన్నారు. సమీత్వం కింద ఎంపికైన జంబాపురం, కోగటం, పొడదుర్తి, సంబటూరు, చదిపిరాళ్ల, ఎల్లారెడ్డిపల్లె, అప్పారావుపల్లె గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఇళ్ల కొలతలు వేసి పన్నులు వేయాల్సి ఉందన్నారు. పీ-4 సర్వే జరుగుతోందని, పంచాయతీ సెక్రటరీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి కరెంట్, వంట, గ్యాస్ కనెక్షన్, బ్యాంక్ ఖాతా లేకపోవడంతో పాటు ఇంట్లో సంపాదించే వారు ఎవరూలేని వారిని బంగారు కుటుంబాలుగా గుర్తించాలన్నారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందడం లేదని సభ్యులు లేవనెత్తిన ప్రశ్నకు ఏఓ సరస్వతి బదులిచ్చారు. మండలంలో ఎరువులు అవసరమైన మేరకు ఉన్నాయని, అయితే కొన్ని చోట్ల ఆర్‌ఎస్‌కే సిబ్బంది శెలవులో ఉండటంతో అక్కడ ఎరువులు అందలేదేమో, విచారించి ఇన్‌చార్జి సిబ్బందిని నియమించి ఎరువులు పంపిణీ చేస్తామని ఆమె వివరించారు. పలు శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

చింతకొమ్మదిన్నె : అనధికార లే అవుట్లను, ప్లాట్లు నియంత్రించడం కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గడువు పొడగించినట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ టీవీ సుబ్బారెడ్డి తెలిపారు. విక్రయ ఒప్పందం లేదా హక్కు పత్రంతో ఉన్న అనధికార లే అవుట్ /ప్లాటుకు 90 రోజుల్లో వ్యక్తిగతంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకునుటకు ఒక గొప్ప అవకాశంగా తెలిపారు. జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ అయి ఉండాలని, నాలుగు చదరపు మీటర్ల లోపు విభజన లేకుండా ఉన్న ప్లాట్లు కూడా నేరుగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను తక్షణం పరిష్కరిస్తారని, ఇప్పటికే ఐపీఎల్పీ ఆమోదించబడిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. పెండింగ్ ఐపీఎల్పీ గుర్తించి వెంటనే పరిష్కరిస్తారన్నారు. అక్టోబరు 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకుని అనధికార లే అవుట్లు, స్థలాలకు భవిష్యత్తులో ఏవిధమైన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవు అని తెలిపారు. ఇతర వివరాలకు 9493220224, 9849966639 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చని వివరించారు.

సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా మహాసభలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి , సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ఒంగోలులో జరగబోతున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు సందర్భంగా ఆగస్టు 23న జరుగు భారీ ప్రదర్శన బహిరంగ సభకు ప్రజలు పాల్గొనాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీలయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి నిధులు, రాష్ట్ర రాజధాని నిర్మాణ బాధ్యత, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విద్యా, వైద్య సంస్థల ఏర్పాటులో కేంద్రం నిర్లక్ష్యం అవలంభిస్తున్నదన్నారు.